క్లుప్తంగా

మట్కా బీటర్లు అరెస్ట్

కడప అర్బన్‌: కడప నగరంలోని వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఇద్దరు మట్కా బీటర్లను సీఐ బి. రామకృష్ణ ఆదేశాల మేరకు ఎస్‌ఐ జి. అమర్‌నాథ్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి పాతబస్టాండ్‌ సమీపంలో శనివారం అరెస్ట్‌ చేశారు. వారి వద్ద నుంచి రూ. 12,200 నగదుతో పాటు, సెల్‌ఫోన్‌, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో నాగార్జునరెడ్డి, రామకృష్ణ అనే నిందితులు ఉన్నారు.

కారల్‌ మార్క్స్‌ చిత్రాల ప్రదర్శనకు తరలిరావాలి



మాట్లాడుతున్న రవిశంకర్‌ రెడ్డి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: మార్క్సిస్టు మహానేత, కామ్రేడ్‌ కారల్‌ మార్క్స్‌ వర్ధంతి సందర్భంగా సోమవారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కారల్‌ మార్క్స్‌ చిత్రాలను పుర వీధులలో ప్రదర్శించనున్నామని, దీనిని జయప్రదం చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్‌ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కారల్‌ మార్క్స్‌ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు వాడ వాడలా నిర్వహిస్తున్నారంటే ప్రపంచాన్ని ఎంత ప్రభావితం చేశాడో అర్థం చేసుకోవచ్చన్నారు. అలాంటి మహనీయుని చిత్రాలను సోమవారం కడప కోటిరెడ్డి సర్కిల్‌ నుండి ఎర్రముక్కపల్లి, రాజీవ్‌ పార్క్‌ వరకు ప్రదర్శన, అనంతరం సభ నిర్వహిస్తున్నామని ప్రదర్శన, సభలో కమ్యూనిస్టు పార్టీలు, నాయకులు, కార్యకర్తలు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు కార్మికులు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసాద్‌ పాల్గొన్నారు.

కల్వర్టులకు మరమ్మతులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప నగరం 9వ డివిజన్‌ ఎన్జీవో కాలనీలో గత కొంతకాలంగా రెండు రోడ్లకు సంబంధించిన కల్వర్టుల వద్ద గుంతలు పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో సొంత నిధులతో మరమ్మతు పనులు చేపట్టినట్లు బీజేపీ నాయకులు బత్తల పవన్‌ కుమార్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయంగా సచివాలయాలకు పలుమార్లు వెళ్లి సిబ్బందికి తెలిపినా వారు పట్టించుకోలేదన్నారు. దీంతో తన సొంత నిధులతో కల్వర్టులకు మరమ్మతు చేశామన్నారు.

క్యారమ్స్‌లో జాతీయస్థాయికి ఎదగాలి

కడప ఎడ్యుకేషన్‌: వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఇస్తున్న ఉచిత క్యారమ్‌ శిక్షణను సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర పోటీల్లో ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలలో రాణించాలని క్యారమ్‌ కోచ్‌లు, ఫిజికల్‌ డైరెక్టర్స్‌ పోలంకి గణేష్‌బాబు, సురే కృష్ణయ్యలు పేర్కొన్నారు. డీఎస్‌ఏ సహకారంతో శనివారం కడప పట్టణంలోని కడప ఇండోర్‌ స్టేడియం, మున్సిపల్‌ ఉర్దూ పాఠశాలలో ఉచిత క్యారమ్‌ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత క్యారమ్‌ శిబిరానికి ఆదరణ ఉందన్నారు. కోచింగ్‌ క్యాంపులో తొలిరోజు సుమారు 25 మంది బాలబాలికలు పాల్గొన్నారని తెలిపారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో చక్కగా శిక్షణ తీసుకుని జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని జాతీయస్థాయికి ఎదగాలన్నారు. క్యారమ్స్‌పై ఆసక్తి ఉన్న వారు 8297059998 నెంబర్‌ను సంప్రదించాలని కోచ్‌ గణేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్‌ కోచ్‌ శ్రీనివాస్‌, పీడీలు సాగర్‌, సందా బాలాజీ పాల్గొన్నారు.

6న డయల్‌ యువర్‌ డిపో మేనేజర్‌

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యల పరిష్కార లక్ష్యంగా ఈ నెల 6వ తేదీన డయల్‌ యువర్‌ డిపో మేనేజర్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కడప డిపో మేనేజర్‌ డిల్లీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రయాణీకులు 9959225774 నెంబరు ఫోన్‌ చేసి తమ సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్సీ, ఎస్టీ కేసులను నీరుగార్చడం తగదు

కడప కార్పొరేషన్‌: ఎస్సీ, ఎస్టీ కేసులను నీరుగార్చే ప్రయత్నాలు చేయడం తగదని ఆర్‌పీఐ లీగల్‌ సెల్‌ రాష్ట్ర ఛైర్మెన్‌ వై. రమేష్‌ బాబు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్సీలు క్రైస్తవ మతం స్వీకరిస్తే వారిని ఎస్సీలుగా పరిగణించలేదని రెండు రోజుల క్రితం హైకోర్టు తీర్పునివ్వడం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం నియమ నిబంధనలకు పూర్తి వ్యతిరేకమన్నారు. ఈ తీర్పును ఆర్‌పీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. 1973లో ఏపీ ఉమ్మడి రాష్ట్రం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఎస్సీలు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే విద్య, ఉద్యోగాల్లో మాత్రమే వారిని బీసీ–సీగా పరిగణిస్తారని చెప్పడం జరిగిందన్నారు.

తాటి ముంజ.. భలే మజా



ప్రస్తుత వేసవికాలంలో ఎండలు రోజు రోజుకూ తీవ్రమవుతున్నాయి. వేసవితాపాన్ని తట్టుకోలేని జనం ఉపశమనం కలిగించే ఆహార పదార్థాలు, పండ్లు, కాయలను కొనుగోలు చేసేందుకు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. మండే ఎండల్లో దాహార్తిని తగ్గించడానికి చల్లదనాన్ని పెంపొందించేందుకు తాటిముంజలు ఎంతో ఉపకరిస్తాయి. ప్రజల అభిరుచి మేరకు పల్లెల నుంచి రైతులు, వ్యాపారులు తాటికాయలను ఆటోలు, బండ్లు, ట్రాక్టర్లలో తెచ్చి వినియోగదారుల ముందే తాటికాయలను కొట్టి ముంజలను ఫ్రెష్‌గా ఇస్తున్నారు. డజన్‌ ముంజలు రూ.100 అమ్ముతున్నారు. నగరంలో ఎస్పీ బంగళా, ఆల్‌ ఇండియా రేడియో కార్యాలయాల వద్ద తాటి ముంజలను విక్రయిస్తున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్‌, కడప



గండి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న గండి అంజన్న

చక్రాయపేట : గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయస్వామి ఆశీస్సుల కోసం శనివారం భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. శనివారంతో పాటు సెలవులు ఉండటంతో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు గండి అంజన్న స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య, ఛైర్మన్‌ కావలి కృష్ణతేజలు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉచిత విద్య సద్వినియోగం చేసుకోవాలి



విద్యాహక్కుచట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ ఇర్షాద్‌ అహ్మద్‌, సీఆర్‌ఎంటీలు

కడప ఎడ్యుకేషన్‌: రాష్ట్ర ప్రభుత్వం విద్యాహక్కుచట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలకు అవకాశాలను కల్పిస్తుందని, దీనిని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కడప మండల విద్యాశాఖ అధికారులు గంగిరెడ్డి, ఇర్షాద్‌ అహ్మద్‌లు పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని కాగితాల పెంట పరిసర ప్రాంతాలలో విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలలలో ప్రవేశాలు పొందడానికి సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు, పీఆర్‌ఎంటీలు ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేస్తూ విద్యాహక్కు చట్టంపై ఉచిత ప్రవేశాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కడప మండలానికి సంబంధించిన పలువురు సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీరంజన్‌రెడ్డి

కడప కార్పొరేషన్‌: మున్సిపాలిటీల్లో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్‌ విభాగ కమిటీ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన వై. శ్రీరంజన్‌ రెడ్డి శనివారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ పదవి అలంకారప్రాయం కాకూడదని, అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చాలని సూచించారు. అనంతరం శ్రీరంజన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకముంచి పదవి ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్‌ సురేష్‌ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వార్థం కోసమే రాజధాని నిర్మాణం

– వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జి నరేన్‌ రామాంజులరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నరేన్‌ రామాంజులరెడ్డి

కమలాపురం : సీఎం చంద్రబాబు తన స్వార్థం, స్వలాభం, సొంత కమ్యూనిటీ కోసమే అమరావతి నిర్మిస్తున్నారని, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు దొందూ దొందేనని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్‌ రామాంజులరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని అమరావతి పునఃప్రారంభ కార్యక్రమం అంతా మోదీ, చంద్రబాబు ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకోవడమే సరిపోయిందని, రాష్ట్రానికి కావాల్సిన నిధులను అడగడంలో చంద్రబాబు వైఫల్యం చెందారని, అలాగే ఆశగా ఎదురు చూస్తున్న ప్రజలకు ఎలాంటి హామీలు ఇవ్వకుండా ప్రధాని మోదీ మరో సారి మోసం చేశారని ధ్వజమెత్తారు. కేవలం చంద్రబాబు తన స్వార్థం, స్వలాభం, సొంత కమ్యూనిటీ కోసమే ఈ రాజధాని నిర్మాణం చేపడుతున్నారని మండి పడ్డారు. 2014లో తట్టెడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చిన మోదీ ఈ సారి అవి కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. మహానగరం అని చంద్రబాబు పదే పదే సంబర పడిపోతున్నారని, అవి నిర్మిస్తే వచ్చేవి కావన్నారు. ఒక్క కేంద్ర పరిశ్రమ కూడా లేకుండా మహా నగరం ఎలా రూపుదిద్దు కుంటుందని ఆయన ప్రశ్నించారు. బీజేపీకి రాష్ట్రంపై ఎంత ప్రేమ ఉందో దీనిని బట్టే అర్థం అవుతుందన్నారు. తెలంగాణలో కేవలం రూ.668 కోట్లతో 28 ఎకరాల్లో సచివాలయం నిర్మించారని, ఢిల్లీలో రూ.980 కోట్లతో పార్లమెంటు భవనం నిర్మిస్తే అమరావతి నిర్మాణానికి రూ.4600 కోట్లు అవసరమా? అని ఘాటుగా ప్రశ్నించారు. ప్రత్యేక హోదా ఇస్తేనే పరిశ్రమలు వస్తాయని, అవి రాకపోతే సంపద సృష్టి ఎలా జరుగు తుందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజు పాశెం సుబ్బారెడ్డి, గంగాధర్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మహ్మద్‌ సాదిక్‌, మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్‌, జగన్‌మోహన్‌రెడ్డి, దేవదానం, రామసుబ్బారెడ్డి, గండి భాస్కర్‌, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధోత్సవం

కమలాపురం : మండలంలోని కోగటం గ్రామంలో వెలసిన శ్రీ సయ్యద్‌ షా ఆలంపీర్‌ స్వామి వారి గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి నిర్వాహకులు గండ్లూరి పెద్దవీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మయ్యశెట్టి నివాసం నుంచి గంధంను ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. గంధం దర్గా చేరుకున్న అనంతరం స్వామి వారి మజార్‌పై ఎక్కించారు. పూల చాదర్లు సమర్పించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు స్పందన

కడప ఎడ్యుకేషన్‌: యూటీఎఫ్‌ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో కడపలోని యూటీఎఫ్‌ కార్యాలయంలో జరుగుతున్న ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు స్పందన వస్తోందని యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్‌, పాలెం మహేష్‌ బాబు తెలిపారు. ఉచిత డీఎస్సీ కోచింగ్‌ ఎనిమిది రోజులుగా విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. విషయ నిపుణుల చేత బోధన , ప్రతిరోజు స్లిప్‌ టెస్ట్‌ నిర్వహిస్తున్నామని తెలిపారు. కడప జిల్లాలోని అభ్యర్థులే కాక చిత్తూరు, కర్నూలు, ప్రకాశం,అనంతపురం తదితర జిల్లాల నుండి కూడా శిక్షణకు వస్తున్నారని వారు తెలిపారు. ఉచిత శిక్షణలో కడప జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్‌ సైతం సైకాలజీ బోధిస్తున్నారన్నారు. సోమవారం, మంగళవారం ఇంగ్లీష్‌ మెథడాలజీ బోధిస్తారని , ఆసక్తి కలిగిన ఎస్‌జీటీ, స్కూల్‌ అసిస్టెంట్‌ అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం 8.30 నుండి సాయంత్రం 6.30 గంటల వరకు కోచింగ్‌ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



యూటీఎఫ్‌ కార్యాలయంలో డీఎస్సీ కోచింగ్‌ తీసుకుంటున్న అభ్యర్థులు

సైకాలజీ స్టడీ మెటీరియల్‌ ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్‌: మాజీ ఎమ్మెల్సీ కేఎస్‌ లక్ష్మణరావు ఆధ్వర్యంలో రూపొందించిన సైకాలజీ స్టడీ మెటీరియల్‌ను శనివారం ఉదయం యూటీఎఫ్‌ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌ బాబు మాట్లాడుతూ త్వరలో జరగబోవు డీఎస్సీ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని తక్కువ సమయంలో సైకాలజీ సబ్జెక్టును పూర్తిగా అవగాహన చేసుకునే విధంగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్‌ లక్ష్మణరావు స్టడీ మెటీరియల్‌ రూపొందించారన్నారు. కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్‌ ఎమ్మెల్సీగా 14 సంవత్సరాల పాటు పని చేయడంతో పాటు ఎంతో మంది ఉద్యోగస్తులకు శిక్షణ ఇచ్చి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన వ్యక్తి కేఎస్‌ లక్ష్మణరావు అని తెలిపారు. ఈయన నిరంతరం పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు కెరీర్‌ గైడెన్స్‌ అందిస్తుంటారని తెలిపారు. ఈ మెటీరియల్‌ కావలసినవారు యూటీఎఫ్‌ కడప జిల్లా శాఖను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్‌ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్‌ అహ్మద్‌, ఆడిట్‌ కమిటీ కన్వీనర్‌ ప్రభాకర్‌, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్‌, కేదార్నాథ్‌, నాగిరెడ్డి, ప్రకాష్‌ బాబు పాల్గొన్నారు.



మెటీరియల్‌ను విడుదల చేస్తున్న యూటీఎఫ్‌ నాయకులు

గ్రాండ్‌ లాంగ్‌ మార్చ్‌ను జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: కడప నగరంలో ఆదివారం వక్ఫ్‌ నూతన సవరణ చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న గ్రాండ్‌ లాంగ్‌ మార్చ్‌ జయప్రదం చేయాలని వక్ఫ్‌ పరిరక్షణ జేఏసీ జిల్లా కన్వీనర్‌ అహ్మద్‌ బాబు, సిటీ కన్వీనర్‌ జాకీర్‌, జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్‌ గౌస్‌ పీర్‌ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం రాజ్‌ కళ్యాణ మండపంలో వక్ఫ్‌ పరిరక్షణ జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నగరంలో జరిగే లాంగ్‌ మార్చ్‌ నేపథ్యంలో అన్ని పార్టీల ప్రతినిధులతో సభ ఉంటుందని తెలియజేశారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ ఇండియా పర్సనల్‌ లా బోర్డు రాష్ట్ర నాయకులు ఇషాక్‌ అలీ, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్ర శేఖర్‌, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌ రెడ్డి, ఎస్‌ డి పి ఐ రాష్ట్ర అధ్యక్షులు తన్వీర్‌, నగర కన్వీనర్‌ మౌలానా జాకీర్‌ హుస్సేన్‌, సీపీఐఎం ఎల్‌ ఓబయ్య, కాంగ్రెస్‌ గౌస్‌ పీర్‌, వైఎస్‌ఆర్‌సీపీ షఫీ పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న వక్ఫ్‌ బోర్డు పరిరక్షణ నాయకులు

లక్ష్యంపై దృష్టి సారించాలి

కడప ఎడ్యుకేషన్‌: లక్ష్యంపై దృష్టి, శ్వాసపై నియంత్రణ, ఆయుధంపై పట్టు మంచి ఫైరర్‌కు ఉండవలసిన లక్షణాలు అని 30 ఆంధ్ర బెటాలియన్‌ ఎన్‌.సి.సి కమాండింగ్‌ అధికారి కల్నల్‌ ఎన్‌ సూర్యనారాయణ మూర్తి అన్నారు. తెలుగు గంగ కాలనీలో జరుగుతున్న ఒకటవ కంబైన్డ్‌ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం ఎన్‌.సి.సి క్యాడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రతిభ కనబరిచిన ఎన్‌.సి.సి క్యాడెట్లను ఈనెల 13వ తేదీ నుండి రాష్ట్రస్థాయిలో జరిగే ఇంటర్‌ డైరెక్టరేట్‌ షూటింగ్‌ పోటీలకు ఎంపిక చేస్తామని క్యాంప్‌ కమాండెంట్‌ కల్నల్‌. ఎన్‌. సూర్యనారాయణ మూర్తి తెలిపారు. పట్టుదలతో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ భవిష్యత్‌లో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్‌ కమాండెంట్‌ గ్రూప్‌ కెప్టెన్‌ ఆర్‌.జీ. ఆత్రే, ఎన్‌.సి.సి అధికారులు కెప్టెన్‌. డాక్టర్‌. నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్‌, జగదీష్‌, సురేంద్ర నాయక్‌, పరేడ్‌ శిక్షణ అధికారులు సుబేదార్‌, మేజర్‌ అనిల్‌ కుమార్‌, రూపేంద్ర జిత్‌ సింగ్‌, సీ.ఎల్‌. రెడ్డి, కొండా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫైరింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

జాబ్‌ మేళా



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్‌: కడప రిమ్స్‌ రోడ్డులోని స్పిరిట్స్‌ డిగ్రీ కళాశాలలో శనివారం కడప కొప్పర్తి ఇండస్ట్రియల్‌ ఏరియాలోని ఆడేసి బై చానల్‌ ప్లే లిమిటెడ్‌ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 14 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్‌ రవీంద్ర తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలకు మొత్తం 25 మంది విద్యార్థులు హాజరుకాగా ఇందులో 14 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ తరుపున రీజనల్‌ హెడ్‌ వికాస్‌ మిశ్రా, అసిస్టెంట్‌ మేనేజర్‌ మనోజ్‌, ఉద్యోగ ప్రతినిధులు సతీష్‌, సుష్మలు హాజరయ్యారు. ఉద్యోగలకు ఎంపికైన అభ్యర్థులకు కళాశాల అధినేత నిర్మల, డైరెక్టర్‌ రవీంద్ర, వైస్‌ ప్రెసిడెంట్‌ శ్రీకాంత్‌, ఉద్యోగ కల్పనాధికారి మునీర్‌లు అభినందనలు తెలిపారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు

వల్లూరు (చెన్నూరు) : ఉమ్మడి కడపజిల్లా మైనార్టీ, క్రిస్టియన్‌ వర్గాలకు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీలకు రూ.లక్ష నుంచి రూ.8 లక్షల వరకు, క్రిస్టియన్‌ మైనార్టీలకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు అందిస్తామన్నారు. ఎంపికైన వారికి 50 శాతం సబ్సిడీ మంజూరవుతుందన్నారు. అర్హులు హెచ్‌టీటీపీఎస్‌://ఏపీఓబీఎంఎంఎస్‌.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్‌.ఇన్‌ వెబ్‌సైట్‌ ద్వారా ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9290448452 నెంబరులో సంప్రదించాలన్నారు.

రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న మోడీ

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: అమరావతిలో రెండవ సారి రాజధాని నిర్మాణం కోసం దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు లు మరో మారు శంకుస్థాపనలు చేస్తూ రాష్ట్ర ప్రజలకు అబద్ధాలు, బూటకపు మాటలు చెబుతూ మోసం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌ ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం నుండి నవ్యాంధ్రప్రదేశ్‌ రాజధాని నిర్మాణం కోసం నిధులు ఇతోధికంగా ఇచ్చామని బహిరంగ సభలో దేశ ప్రధాని అబద్ధాలు చెప్పారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ కడప జిల్లాకు ఉక్కు పరిశ్రమ, కొప్పర్తి ఇండస్ట్రియల్‌ కారిడార్‌ అభివృద్ధి ప్రస్తావన చేశారని, కానీ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పనులు ఎప్పుడు చేపడతారో, నిధులు ఎంత కేటాయిస్తారో చెప్పలేదన్నారు. గతంలో ఇదే సీఎం, ఇదే ప్రధానిని పిలిపించి రాజధానికి శంకుస్థాపన అట్టహాసంగా చేశారని, అభివృద్ధి మాత్రం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్మోహన్‌ , దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌

నిరాశపరిచిన మోడీ పర్యటన

కడప సెవెన్‌రోడ్స్‌ : ప్రధాని నరేంద్రమోడీ పర్యటన ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు మరోమారు నిరాశ కలిగించిందని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.నారాయణ అన్నారు. శనివారం నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధాని నిర్మాణ శంకుస్థాపనకు రెండవ పర్యాయం వచ్చిన మోడీ విభజన హామీల అమలుపై ఎలాంటి ప్రస్తావన తేకపోవడంపై ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం, కర్నూలులో రైల్వే వ్యాగన్ల రిపేరు కర్మాగారం, బెంగుళూరు–కడప–అమరావతి రైల్వే లైన్‌ పూర్తి చేసే విషయం, బుందేల్‌ఖండ్‌ తరహాలో సీమ, ఉత్తరాంధ్రలకు ప్యాకేజీ వంటి విషయాలను ఆయన ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రికి అమరావతి అభివృద్ధి తప్ప రాష్ట్ర అభివృద్ధి పట్టడం లేదన్నారు. ఇందువల్ల రాయలసీమ, ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సీఆర్‌వీ ప్రసాద్‌రావు, కోశాధికారి అంజి, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.